

అమ్మో... బార్లా..

- రీ నోటిఫికేషన్‌కు స్పందన అరకొరే
- గుంటూరులో 26, పల్నాడులో 8, బాపట్లలో 6 బార్లకు నేడు లాటరీ
- మిగిలిన బార్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

112 బార్లలో 72 బార్లకు దరఖాస్తులు నిల్

ఒకప్పుడు మద్యం బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు పోటీపడేవారు. ఎంత మొత్తం అయినా చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యేవారు. అయితే నూతన మద్యం పాలసీ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఇప్పటికి రెండు సార్లు నోటిఫికేషన్ ఇవ్వగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఎలాగైనా బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు చేయించాలని ఎక్సైజ్ విభాగం రెండు సార్లు గడువు కూడా పెంచింది. అయినా బార్లు తీసుకునేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. తొలి విడత నోటిఫికేషన్ లాటరీ ప్రక్రియ అనంతరం మిగిలిన(గుంటూరు జిల్లాలో 67, పల్నాడు జిల్లాలో 30, బాపట్ల జిల్లాలో 15) బార్లకు ఈ నెల 3న ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకసారి గడువు పెంచినా కేవలం 72 బార్లకు నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అంటే మూడు జిల్లాల పరిధిలో 40 బార్లకు ఎవరూ ముందుకు రాలేదు.

(బాపట్ల , ఆంధ్రజ్యోతి)

ఏం చేస్తారో తెలియదు.. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరి ధిలోని అన్ని బార్ల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు రావాల్సిందేనని ఈ నెల 3న బార్ల రీ నోటిఫికేషన్ జారీ సమయంలో ఎక్సైజ్ యంత్రాంగానికి ఉన్నతాధికారుల నుంచి అందిన అనధికారిక ఆదేశాలు. తొలివిడత నోటిఫికేషన్‌లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఉన్నతాధికారులు బాపట్ల జిల్లా యంత్రాంగంపై కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. మొత్తం బార్లకు దరఖాస్తులు రావాల్సిందేనని లేకపోతే సిబ్బంది వైఫల్యంగా పరిగణించి చర్యలకు సైతం వెనకాడబోమనే అనధికారిక ఆదేశాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు రీ నోటిఫికేషన్ జారీ సమయంలో పంపినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో వ్యాపారులతో ఎలాగైనా దరఖాస్తులు చేయించేందుకు శత విధాలా ప్రయత్నాలు చేశారు. ఎక్కడికక్కడ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారి ద్వారా కూడా దరఖాస్తులు చేయించేందుకు ప్రయత్నించారు. చివరకు రాజకీయ నేతలతో వ్యాపారులపై ఒత్తిడి కూడా చేశారు. అప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు వేయించడానికి చేయని ప్రయత్నం లేదు. మలి నోటిఫికేషన్ ఈ నెల 3న జారీ చేయగా తొలుత ఇచ్చిన గడువు 14 కాగా దానిని 17 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోగా బుధవారంతో ఆ గడువూ ముగిసింది. అయినా రీ నోటిఫికేషన్ ద్వారా కూడా మొత్తం బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు రాలేదు.

బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు తొలి నోటిఫికేషన్‌లో 4 బార్ల ఏర్పాటు ప్రక్రియను ఎక్సైజ్ విభాగం ముగించింది. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం సాయంత్రం గడువు ముగిసేప్పటికి ఆరు బార్లకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.నిబంధనల ప్రకారం

(మిగతా 6వ పేజీలో)

రాష్ట్ర పండుగగా బీచ్ ఫెస్టివల్

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రుల సమీక్ష



సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26, 27, 28 తేదీల్లో బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని మంత్రులు నిర్ణయించారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, ఎం.మాలకొండయ్య, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డిలతో మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించారు. బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అనగాని తెలిపారు. తీరంలోని ఇసుకలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పర్యాటకులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ బీచ్ ఫెస్టివల్‌ను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రికల్ బస్సులు

1500 వివిధ రకాల నూతన బస్సులతో స్త్రీశక్తి పథకం విజయవంతం: ఎండీ ద్వారకా తిరుమలరావు

రేపల్లె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థితికి తీసుకుని వెళ్లేందుకు 1,050 ఎలక్ట్రికల్ బస్సులు, వివిధ రకాల నూతన బస్సులు 1,500 తీసుకువస్తున్నామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె ఆర్టీసీ డిపోలో బుధవారం స్త్రీశక్తి విజయోత్సవ సభ, ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'స్త్రీశక్తి ఉచిత పథకం కోసం ఆరు నెలల ముందుగానే తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలను సిద్ధం చేశాం. స్త్రీశక్తి పథకం ఇతర రాష్ట్రాల్లో కంటే మన రాష్ట్రంలోనే సజావుగా సాగుతుంది. 90 శాతం ఆక్యుపెన్సీ పెరిగింది. రేపల్లె డిపోతో సహా ఇప్పటి వరకూ 115 డిపోలు పరిశీలించా. స్త్రీశక్తి పథకంలో ఏర్పడిన ఇబ్బందులు ఏమైనా ఉంటే అడిగి తెలుసుకున్నా. ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు స్నేహపూర్వకంగా మెలగాలి. ఆర్టీసీని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం చంద్రబాబు సహకారంతో ముందుకు వెళుతున్నాం. కొత్త సర్వీస్‌లు రావటంతో ఆర్టీసీ మరింత బలోపేతమవుతుంది. రాష్ట్రంలో అన్ని డిపోలు ఆర్థికంగా బలపడేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులందరికి మెరుగైన సౌకర్యాలు అందిస్తాం' అని ద్వారకా తిరుమలరావు తెలిపారు. అనంతరం డిపో ఆవరణలో పర్యావరణ పరక్షణలో భాగంగా మొక్కలను నాటారు.



మొక్కలను నాటుతున్న సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఉద్యోగులు

బర్లీ పొగాకు నిధులు జమ

- రెండు విడతల్లో రూ.100 కోట్లు..
- ఒక్క బాపట్ల జిల్లాలోనే రూ.74 కోట్లు
- పొగాకు రైతుల్లో ఆనందం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మూడు నెలలుగా కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే బాపట్ల జిల్లాలో 1,20,000 క్వింటాళ్లు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలను కూడా కలుపుకుంటే మొత్తం 1,60,000 క్వింటాళ్ల వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. వీటి తాలూకా నగదును ఈ నెల 1న తొలి విడతగా ప్రభుత్వం అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది. బాపట్ల జిల్లాలో రూ.22 కోట్లను మొదటి దశలో నిధులు విడుదల చేసింది. దశల వారీగా ఇప్పటి వరకు మొత్తం రూ.100 కోట్లను రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో బాపట్ల జిల్లా రైతుల వాటా రూ.74 కోట్లు కాగా, మిగిలిన మూడు జిల్లాల రైతులకు రూ.26 కోట్లు జమ చేసినట్లు యంత్రాంగం వెల్లడించింది.

నేడు గుంటూరులో రిపోర్ట్ చేయాలి

డీఎస్సీ అభ్యర్థులకు డీఈవో రేణుక సూచన

గుంటూరు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గురువారం గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు రిపోర్టు చేయాలని డీఈవో రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న రాజధాని అమరావతిలో జరిగే నియామకపత్రాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి డీఎస్సీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, తమ కుటుంబ సభ్యులలో ఒకరు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో ఆంధ్ర ముస్లిం కళాశాలకు రావాలన్నారు. ప్రత్యేక బస్సుల్లో సచివాలయ సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని అభ్యర్థులు గమనించాలని డీఈవో తెలిపారు.

వ్యవసాయంలో డ్రోన్‌ల శకం

80 శాతం రాయితీతో కూటమి ప్రోత్సాహం ● జిల్లాలో ఇప్పటికే 35 యంత్రాల పంపిణీ

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో డ్రోన్‌ల శకం మొదలైంది. రైతులకు శ్రమ తగ్గించి దిగుబడులు పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 80 శాతం రాయితీతో డ్రోన్‌ల పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో రైతులు కూడా డ్రోన్‌లపై ఆసక్తి కనబరుస్తున్నారు. పంటల సాగులో చీడపీడల నివారణకు పలు రకాల పురుగు మందులను పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం నానో యూరియా, డీఏపీలను సైతం నేరుగా మొక్కలకే అందించాల్సి ఉంటుంది. అయితే ఈ విధంగా పైర్లపై నేరుగా మందులను పిచికారీ చేయడంలో డ్రోన్‌ల ప్రాధాన్యం పెరుగుతోంది.



రైతుకు రాయితీ డ్రోన్ అందిస్తున్న అధికారులు

పిచికారీ చేసే సాధనాలు ఎన్నో...

గతంలో చేతితో వ్యాక్యూం ప్రెజర్‌తో స్ప్రే చేసే ట్యాంకులున్నారు. వీటితో పిచికారీ చేయడం శ్రమతో కూడుకున్న కారణంగా పవర్ స్ప్రేయర్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆ తరువాత ట్రైవాస్ స్ప్రేయర్, ట్రాక్టర్‌లకు బిగించి పిచికారీ చేసే వైజర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల నీటి తుంపరలు మొక్కంతా విస్తారంగా పడే అవకాశం ఉంది. గత దశాబ్ద కాలంగా వీటి వినియోగం అధికంగా ఉంది. ఇక ప్రత్యేకంగా పురుగు మందును పిచికారీ చేసే వాహనాలను కూడా మిరప, వేరుశనగ తదితర పంటల్లో వినియోగించారు. అయితే వీటన్నింటినీ తలదన్నే రీతిలో డ్రోన్ స్ప్రేయర్‌లు తాజాగా వ్యవసాయం రంగంలోకి అడుగు పెట్టాయి.

ప్రభుత్వం ప్రోత్సాహం..

ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీతో డ్రోన్‌లను అందిస్తోంది. మార్కెట్‌లో వీటి ధర ప్రస్తుతం రూ.9.80 లక్షలు ఉంది. అందులో సుమారు రూ.2 లక్షలు మాత్రమే రైతు భరించాల్సి ఉంటుంది. అందులోనూ కొంత రైతు, కొంత బ్యాంకు విల్లింగ్‌తో యంత్రం అందిస్తోంది. పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్‌లు అందించే వెసులుబాటు ఇప్పటికే కల్పించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 35 యంత్రాలు అందజేశారు. రాబోవు కాలంలో వీటి వినియోగం పెరిగి రైతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం లేకపోలేదు.

మహిళలకు ముందస్తు పరీక్షలు తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
- ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే వేగేశన




కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల బారినపడకుండా మహిళలు ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కోరారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో బుధవారం స్వస్త్‌నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన మహిళలందరు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికెళ్లి క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడుకోవాలన్నారు. మహిళలు అవసరం లేకపోయిన క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డెంగీ జ్వరం బారిన పడితే.. బ్లడ్ శాంపిల్స్ కోసం నగదు చెల్లించాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యశాలలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనంతరం ఏరియావైద్యశాలలో ఓపీ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లాలో మెడికల్ కాలేజి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై..ఉదాసీనత!

- బల్లికురవ మండలంలో పెద్ద ఎత్తున అవకతవకలు
- సామాజిక తనిఖీల్లో రూ.3 కోట్ల అవకతవకల నిర్ధారణ
- ప్రజావేదిక ముగిసి 40 రోజులు..
- ముందుకు కదలని రికవరీ ఫైల్



బల్లికురవలో జరిగిన సామాజిక ప్రజా వేదికలో పాల్గొన్న జిల్లా పీడీ విజయలక్ష్మి (పాతచిత్రం)

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే కూలీలకు ఉపాధి కల్పించేందుకు సంకల్పించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. ఈ పథకం కింద చేపట్టే పనులపై ఏటా చేపడుతున్న సామాజిక తనిఖీల్లో కోట్ల రూపాయల అవకతవకలు బయటపడుతున్నాయి. కానీ, తుది దశకు వచ్చే సరికి ఉన్నతస్థాయి అధికారులు మాత్రం అసలు ఏమీ జరగలేదు అన్నట్లు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఇలా అయితే రూ.లక్షలు వెచ్చించి లైవ్ ఆడిట్‌లు చేసి ఉపయెగం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా వేదికలపై నమ్మకం ఎలా ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున బోగస్ మస్టర్లు, కొలతల్లో తేడాలు బట్టబయలు అయినా.. అందుకు బాధ్యులపై చర్యలు చేపట్టక పోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు ఏవీ..?

బల్లికురవ మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన 645 పనులకు రూ. 12 కోట్ల నిధుల వినియెగంపై సామాజిక తనిఖీలు జూలై, ఆగస్టులో చేపట్టారు. పనులకు పోకుండా మస్టర్లు వేశారని, ప్రభుత్వ, సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు సైతం మస్టర్లు వేయడంతో పాటు.. కుంటలు తవ్వకుండానే తవ్వినట్లు రూ.కోట్ల నిధులు ప్రక్కదారి పట్టాయని తనిఖీల్లో వెల్లడైంది. బల్లికురవ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా వేదిక సభకు వచ్చిన జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి పరిశీలన చేసి రూ.2. 30 కోట్ల పనులు అసలు చేయలేదని గుర్తించారు. అలానే మరో కోటి రుపాయల నిధులకు మళ్లీ పనులు చేయించాలని మొత్తం మూడు కోట్ల రూపాయల మేర అవకతవకలు ఉన్నట్లు ప్రజావేదికలలో చదివి వినిపించారు. మల్లాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గ్రామంలో జరిగిన లోపాలను పూర్తి ఆధారాలతో ప్రజా వేదిక ముందు ఉంచారు. కానీ, ఇంత వరకు ఎలాంటి రికవరీలు, సంబంధిత ఉద్యోగులపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అసలు సామాజిక తనిఖీల వివరాలను 40 రోజులు దాటినా అధికారులు బయట పెట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారులు బల్లికురవ మండలంలో జరిగిన ఉపాధి పనుల అవకతవకలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి.. మున్ముందు పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చదనంపై వేటు



6లో..

- దశాబ్దాల క్రితం నాటిన చెట్లు నరికివేత
- కళాశాల ప్రిన్సిపాల్‌పై స్థానికుల ఫిర్యాదు
- విచారణకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు

సమర్థంగా స్త్రీశక్తి పథకం అమలు

● ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చంగల్‌రెడ్డి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని.. ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఆర్టీసీ నిర్వహణ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌తో పాటు డిపో గ్యారేజీ పరిశీలించి బస్సుల సంఖ్య, కండిషన్, రోజువారీ తిరిగే కిలోమీటర్లు, సిబ్బంది కొరత, మహిళల నుంచి ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం తెనాలి ప్రాంతంలో మహిళలకు బాగానే ఉపయోగపడుతుందన్నారు. మహిళల పట్ల సిబ్బంది సహనంతో వ్యవహరించాలని, గుర్తింపు ఏదైనా, దాని నకలు తెచ్చినా అనుమతించాలని చెప్పారు. బస్సుల రద్దీకి అనుగుణంగా ట్రిప్పులను పెంచాలని, బస్సుల సంఖ్య సరిపోకపోతే ప్రతిపాదనలు పంపించాలని కోరారు. బస్ స్టేషన్‌లో ఆవరణలో సహచర ఈడీలతో కలిసి మొక్కలు నాటారు. ఆయనతో పాటు ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంగల్‌రెడ్డి, జోన్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నషీలామణికి అభినందనలు



రత్న షీలామణిని అభినందిస్తునన వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-2గా నియమితులైన ఆచార్య కె.రత్నషీలామణికి బుధవారం వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహా చలం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీనియర్ ఆచార్యులుగా, ప్రిన్సిపాల్, పరిశోధన విభాగం సమన్వయకర్త, రెక్టార్‌గా రత్నషీలా మణి సేవలను కొనియాడారు. అలాగే ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య సంచాలకులు వెంకటేశ్వర్లు, పలువురు డీన్లు, ప్రొఫెసర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పచ్చదనంపై వేటు

● దశాబ్దాల క్రితం నాటిన చెట్లు నరికివేత
● కళాశాల ప్రిన్సిపాల్‌పై స్థానికుల ఫిర్యాదు
● విచారణకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు



పాఠశాల ఆవరణలో మొద్దులు

రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లుతో ఆహ్లాదకర వాతావరణంతో నిండిన విద్యా ప్రాంగణం ప్రస్తుతం వెలవెలపోతోంది. చెరుకుపల్లి మండలం కావూరు రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ ఆవరణలో రెండు దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు మహావృక్షాలుగా మారాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటి నీడలో సేదతీరేవారు. అలాంటి చెట్లను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి నరికివేస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులతో పాటు, స్థానికులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కరెంటు వైర్లకు అడ్డం వస్తున్నాయని అందువల్లే తొలగిస్తున్నామని ప్రిన్సిపాల్ సమాధానం చెప్పారు. విద్యుత్ అధికారులకు స్థానిక నాయకులు ఫోన్ చేసి రెసిడెన్షియల్ కాలేజీలో మొక్కలను తొలగించమన్నారా అని ప్రశ్నించారు. అయితే తమకు ఎలాంటి సంబంధం లేదని విద్యుత్ అధికారులు చెప్పారు. కూలీలను ప్రశించగా ప్రిన్సిపాల్ అవనిగడ్డకు చెందినవారికి అమ్మేశారని అందువల్లే నరికామని నరికామని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో చెట్లను నరకాలంటే సంబంధిత అధికారులతో పాటు అటవీశాఖ అధికారులు అనుమతి తప్పనిసరి. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయంతో, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా రూ.లక్షలకు చెట్ల కొట్టించి అమ్మేశారని స్థానికులు ఆరోపించారు. చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు తెలిపారు. ఆపై వారు ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొట్టేసిన చెట్ల మొద్దులను, ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై మండల విద్యాశాఖాధికారి నవీన్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్ల నరికివేతపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

పారిశ్రామికాభివృద్ధి, యువత ఉపాధే ధ్యేయం

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీఐడీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. నూతన ఏపీఐడీసీ డైరెక్టర్లను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. రాష్ట్రమంతటా పారిశ్రామిక అనుకూల వాతావరణం ఏర్పడిందని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టు బడుల వెల్లువ మొదలైందన్నారు. దాంతోపాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం భారీ రాయితీలు ఇచ్చి ప్రోత్స హిస్తోందన్నారు. రాష్టంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు రాయితీపై పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ, డైరెక్టర్లు బాలభారతి, రాజారావు, రమణయ్య, మనోజ్ కుమార్, పండితి మల్హోత్రా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

ఏఎన్‌యూలో జిరోధా వర్సిటీ ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్

● ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన పీబీ సిద్ధార్థ, ఆర్వీఆర్ జేసీ, విజ్ఞాన్

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిరోధా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్ విజయవంతంగా బుధవారం ముగిసింది. డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో దేశంలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 92 జట్లలో 276 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రథమ బహుమతి రూ.12,000 గెలుచుకోగా, ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ బహుమతి రూ.9,000 సాధించింది. విజ్ఞాన్ యూనివర్సిటీ రూ.3,000 తృతీయ బహుమతి గెలుచుకుంది. ఏఎన్‌యూ (యూజీ), (ఎంబీఏ), విజ్ఞాన్ యూనివర్సిటీ జట్లు ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. వర్సిటీ ప్రొఫెసర్లు, ముఖ్య అతిథులు హాజరై విద్యార్థులను అభినందించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది.



క్విజ్ విజేతలతో డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్

డీ-3 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

● రూ.3.45 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్కిల్ ఆపరేష న్ ఎస్ఈ చల్లా రమేష్ నేతృత్వంలో గుంటూరు -1 డివిజన్‌లో డీ-3 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు బుధవారం విస్తృతంగా తనిఖీ చేశారు. డీపీఈ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 58 మంది అధికారులు, 174 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4228 సర్వీసులకు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 115 మందికి రూ.3.45 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263. 9440812361కు చేయాలని కోరారు. తనిఖీల్లో విజి లెన్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకన్నచౌదరి, డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్, రవికుమార్, ఎన్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, ఆపరేషన్ ఏఈ ఎమ్ చంద్రశేఖర్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్ తదితరులున్నారు.

ఏడో రోజు కొనసాగిన ఉపాధ్యాయుల ఆందోళన



సమస్యల పరిష్కారం కోసం సీఎం, ముఖ్యకార్యదర్శికి మెయిల్స్ పంపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ న్యాయమైన ఆర్థిక డిమాండ్స్ సాధనకు ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన వారం ఏడో రోజు కొనసాగింది. ఇందులో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శికి సమస్యలు పరి ష్కరించాలని మెయిల్స్ పంపినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు తెలి పారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయులతో కలసి మెయిల్స్ పంపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి జీ దాస్, ఆడిట్‌కమి టీ సభ్యులు వి.కిషోర్, జిల్లా కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, పి.వేణు గోపాలరావు ఇతరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ తర్వాత ఉద్యోగుల విభజన ప్రక్రియ కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. పలువురు జూనియర్ ఉద్యోగులు గుంటూరు నుంచి పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ నుంచి పలువురు ఉద్యోగులు గుంటూరు సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో వచ్చిన ఉద్యోగులకు రీ పోస్టింగ్‌లు కల్పిస్తూ మంగళవారం రాత్రి గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల విభజనతో గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్‌ల నుంచి పలువురు జూనియర్ ఉద్యోగులు సీఆర్‌డీఏ, బాపట్ల జిల్లాలకు వెళ్లడంతో అక్కడ ఉన్న పలువురు సీనియర్ ఉద్యోగులు జిల్లా కేంద్రం గుంటూరుకు వచ్చినట్లయింది. ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో సర్కిల్‌కు వచ్చిన ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు ఎస్ఈ రెండు రోజుల పాటు కసరత్తు చేశారు.

● తెనాలి ఈఈ చిరంజీవికి ఎస్ఈగా

గుంటూరు సర్కిల్ పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పీ పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా వీవీ చిరంజీవికి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా (ఎస్ఈ)గా పదోన్నతి కల్పించారు. గుంటూరు టౌన్ 4 డిప్యూటీ ఈఈ పి. హుస్సేన్ ఖాన్‌కు ఈఈగా, ఇన్‌చార్జ్‌లు రాజేష్‌ఖన్నా, ఎ.సత్యనారాయణకు ఈఈలుగా పదోన్నతి కల్పించారు. నగరంలో లైన్స్ ఏఈ సుబ్బారావు, డీ4 ఏఈ అంజనీరావు డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి పొందారు. కాగా వారికి పోస్టింగ్‌లు కేటాయించాల్సి ఉంటుంది.

అమ్మో బార్లా

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చిన బాపట్లలో 2, చీరాలలో 3, రేపల్లెలో 1 బార్‌కు లాటరీ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా జరుగుతుందని ఎక్సైజ్ విభాగం తెలిపింది. అయితే మిగిలిన 9 బార్ల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తొలిసారి 4, రెండోసారి 6 బార్లకు వచ్చిన దరఖాస్తులు విషయంలోనే ఎక్సైజ్ విభాగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పలుసార్లు ఆశావహులతో సంప్రదింపులతో పాటు, కొంతమందికి స్థానిక నేతలతో చెప్పించడంతోనే ఈ మాత్రం ఫలితాలు కనబడ్డాయని, ఇకపై మిగిలిన బార్ల విషయంలో నోటిఫికేషన్ ఇచ్చినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని అంతర్గత సంభాషణల్లో ఎక్సైజ్ సిబ్బందే వ్యక్తం చేస్తున్నారు.

- గుంటూరు జిల్లాలో 67 బార్లకు 26 బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున 104 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 41 బార్లకు దరఖాస్తులు రాలేదు.
- పల్నాడు జిల్లాలో 30 బార్లలో 8 బార్లకు నాలుగు దరఖాస్తుల చొప్పున 32 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

41,629 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,909 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,629 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,081 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12300
334	10500	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13800	334	10500	14600
273	10000	13300	నెంబరు. 5	----	----
341	10000	15300	273	----	----
4884	----	----	341	10000	16000
సూపర్ 10	11500	14000	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14800	తేజ	10000	15000
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	15600
బ్యాడిగి	10000	15600	దేవనూరు డీలక్స్	10500	14000
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7400

రెరా చైర్మన్ పదవికి శివారెడ్డి వన్నె తెస్తారు

● అభినందించిన నరెడ్కో గుంటూరు ప్రతినిధులు



రేరా చైర్మన్ శివారెడ్డిని అభినందిస్తున్న నరేడ్కో ప్రతినిధులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెరా చైర్మన్ ఎ.శివారెడ్డి ఆ పదవికి వన్నె తెస్తారని నరెడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం ఆయనను పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. శివారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్టేక్ హోల్డర్స్‌తో కలిసి పారదర్శకత, సామర్థ్యం, వేగవంతమైన అభి వృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. రెరా ద్వారా నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతో పాటు, డెవలపర్స్, వినియోగదారుల ప్రయోజనాలు రక్షణ పొందే లా చూడడం తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు కేసీ హెచ్ అంకారావు, ఉపాధ్యక్షుడు వి శ్రీనాథ్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, చిన తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టా

యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు



పెదమద్దూరు వంతెనపై దిగబడిన ఇసుక లారీ

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని పెదమద్దూరు వాగు ప్రమాదకరంగా మారింది. అమరావతి -విజయవాడ మార్గంలో గతంలో నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. బుధవారం తుళ్లూరు వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వంతెనపై దిగబడింది. ఎక్స్‌వేటర్‌తో ఇసుకను తొలగించి వాహనాన్ని తొలగించారు. ఈ పరిస్థితుల్లో వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న అమృతవల్లి

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆచార్యులు అడిహూడి అమృతవల్లి బుధవారం జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. జమ్మూలోని షేర్ ఈ కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీలో మూడు రోజులుగా పుడమి- పంటల సంరక్షణే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా పరిశోధకులు, విజ్ఞాన వేత్తలతో సదస్సు జరిగింది. ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ భారతీయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. దశాబ్దానికి పైగా పీజీపీఆర్ అధ్యక్షురాలిగా ఆమె సేవలకు, మూడు దశాబ్దాలకు పైగా అధ్యా పకురాలిగా పరిశోధనలకు గానూ ఈ పురస్కారం లభించింది. పలు యూనివ ర్సిటీల డైరెక్టర్లు, ఏఎన్‌యూ ప్రొఫెసర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మాచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని మండాది రోడ్డులో గల తారు ప్లాంట్ వద్ద ఈ నెల 10న జరిగిన తిరుమలకొండ చంద్రశేఖరరావు హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. నిందితుల్లో ఒకరైన ఉప్పుతోళ్ల నాగరాజు భార్యతో మృతుడు చనువుగా వ్యవహరించడంతో కుటుంబ విచ్ఛిన్నానికి దారితీసింది. ఈ క్రమంలో నాగరాజు తన భార్యకు విడాకులిచ్చాడు. తన విడాకులకు కారణమైన చంద్రశేఖరరావుపై కక్ష పెంచుకున్న నాగరాజు తన బావమరిది దేవళ్ల సురేష్, ఉప్పుతోళ్ల నవీన్, ఓర్సు రాంబాబుతో కలిసి అతని హత్యకు పథకం రచించాడు. చంద్రశేఖరరావును నవీన్, రాంబాబు బయటకు తీసుకొచ్చి పూటుగా మద్యం తాగించారు. రాత్రి తారు ప్లాంట్ వద్దకు తీసుకొచ్చి నాగరాజు, అతని బావమరిది సురేష్‌కు అప్పగించి.. అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం నాగరాజు, సురేష్ బండ రాళ్లతో చంద్రశేఖరరావు తలపై మోది హత్య చేశారు. ఈ మేరకు నిందితులైన నాగరాజు, సురేష్, నవీన్, రాంబాబులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు. నిందితులను పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ నిందితులకు 15 రోజులపాటు రిమాండ్ విధించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

● ఎస్పీ ఉమామహేశ్వర్


ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలకు బానిసలవుతున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులు, యువత ఉంటున్నారని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. కావున యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాటి బానిసత్వం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, భవిష్యత్తులో కలిగే ప్రభుత్వం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఈగల్ బృందాలు, స్థానిక పోలీసు అధికారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. మత్తుపదార్థాల విక్రయం, అక్రమ రవాణా, వినియోగం చట్టప్రకారం నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్లాక్ బర్లీ పొగాకు రైతులను ఆదుకుంటాం

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్


వేర్‌హౌస్ గోదాముల్లో పొగాకు నిల్వల గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌బర్లీ పొగాకు రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం ముందుకొచ్చిందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. పొగాకు కొనుగోలుపై సంబంధితాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలులో అంతరాయం లేకుండా అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. జిల్లాలో ఎంతమంది రైతులు ఎంత పంట సాగు చేశారో ఆరా తీశారు. మన జిల్లాలో గోదాముల సంఖ్య, వాటిలో నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం కొనుగోలు చేసిన పొగాకు నిల్వలపై సంబంధిత దస్త్రాలను పరిశీలించారు. నిల్వ సామర్థ్యం లేకపోతే పొరుగు జిల్లాలకు వాటిని పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పొగాకు కొనుగోలుపై పర్యవేక్షణ ఉండాలని సంబంధితశాఖల అధికారులకు సూచించారు. మార్క్‌ఫెడ్ ఏడీ కరుణశ్రీ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

ఈ-ఆఫీస్ ఫైల్స్ విధానం అమల్లోకి రావాలి

ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలో ఇ-ఆఫీస్ ఫైల్స్ విధానం అమల్లోకి రావాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారదర్శకత కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి దస్త్రాన్ని ఆన్‌లైన్‌లో ఉంచాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలలో కాగితం దస్త్రాలు కనిపించరాదన్నారు. కలెక్టరేట్ ఆవరణంలోకి మారిన జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయం నూతన భవనాన్ని పరిశీలించారు. నైపుణ్యాభివృద్ధిసంస్థ జిల్లా కార్యాలయం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం, జిల్లా ఆడిట్ కార్యాలయం, జిల్లా సహకారశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీశాఖ, మత్స్యశాఖ, అగ్నిమాపక, గృహనిర్మాణశాఖల కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఉపకలెక్టర్ లవన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు


రథంబజారులో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు

బాపట్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని రధంబజారులో బీజేపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు బ్రహ్మండం బాలనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, వల్లూరి భావన్నారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ అడపాల శ్రీరామయ్య, జీవీఎల్ మోహన్‌గౌడ్, శ్రీహరి, గుగ్గిలం శ్రీనివాస్, తురకా గోపి, ముప్పల శ్రీనివాస్, ప్రతాప్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు పిన్ని సాంబశివరావు అన్నారు. రేపల్లె పట్టణంలో, అడవులదీవి, నగరం, చెరుకుపల్లి గ్రామాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో ప్రధాని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీజేపీ నాయ కులు వాకా శివరామ్‌ప్రసాద్, మద్దు సురేష్, చారిగడ్ల కిషోర్‌బాబు, గుమ్మడి సాంబశివరావు, అన్నం సాయి, పిన్ని సాంబశివరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం వేమూరులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మందా జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనార్ధన్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ తన మేధస్సుతో ముందుకు నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి యల్లమాటి దాసు, మండల పార్టీ అధ్యక్షుడు వెలివెల సాంబశివరావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఐలవరంలో ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మోదీ చిత్రపటం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జంజనం హేమశంకరరావు, బట్టు వీరరాఘవయ్య, జవ్వాది రమేష్, దిలీప్, కృష్ణ పాల్గొన్నారు.

● నిజాంపట్నం(రేపల్లె), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రధానమంత్రి నరేంద్రమోడీతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామంలో మోర్ల జయరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం అడవులదీవిగ్రామంలో ఆలపాటి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, రామకృష్ణ, రఘునందన, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలపై విద్యార్థులు అవగాహన కలిగియుండాలని చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ అన్నారు. మండలంలోని చందోలు నీలిబంగారయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బుల్లెమ్మ, పోలీసుస్టేషన్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందిపెడితే చెప్పండి.. వాళ్ళపని పడతా : సీఐ

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వెళ్లే సమయంలో ఎవరైన ఇబ్బంది పెడితే నేరుగా నాకు చెప్పండి.. నేను వాళ్ళ పనిపడతానని పట్టణ సీఐ ఆర్.రాంబాబు వసతి గృహ బాలికలకు భరోసానిచ్చారు. పట్టణంలోని సమీకృత గిరిజన బాలికల వసతి గృహంలోని విద్యార్థినులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించారు. పట్టణ ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది కాటంరాజు పాల్గొన్నారు.

శక్తి సముపార్జన కోసమే దేవీ నవరాత్రులు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శక్తి సముపార్జన కోసమే దేవి నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు సమరసత సేవాఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాస్ తెలిపారు. శ్రీసోమేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం సమరసత సేవాఫౌండేషన్ నగర సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించి అమ్మవారిని పూజించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, బొలగాని వెంకటేశ్వర్లు, చిల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సిద్ధాంతాలు పాటిస్తూ ముందుకెళ్లాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



విశ్వకర్మ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు విశ్వకర్మ సిద్ధాంతాలను పాటిస్తూ ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ ఎస్ హాల్లో బుధవారం విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించు టకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మ కులవృత్తులవారి అభ్యున్నతికి విశ్వకర్మ యోజనని తీసుకొచ్చారన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో అమలు చేస్తూ విశ్వకర్మ కులవృత్తులు చేసేవారికి బ్యాంక్ రుణాలు అందజేసి వారి అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ జిల్లాలోని విశ్వకర్మ కులస్థులకు ఎటువంటి సహాయసహకారాలు కావాలన్న వారి అభివృద్ధికి సహాయపడుతానని తెలిపారు. విశ్వకర్మ సంఘ సభ్యులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖాధికారి బి.శివనాగేశ్వరరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కడలి జగదీష్‌కుమార్, కోశాధికారి ఎం.సుధాకర్, యువజన సంఘం అధ్యక్షుడు మోగంటి అనిల్‌కుమార్, చిత్తరంజన్‌శర్మ, సున్నం సుబ్బారావు, ఇంకొల్లు వీరభద్రాచారి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కళలకు, నైపుణ్యాలకు అధిపతి విశ్వకర్మ

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి

సహస్ర కళలకు, నైపుణ్యాలకు అధిపతి విశ్వకర్మ అని కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన పటానికి రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్‌తో కలిసి కమిషనర్ జి.రఘునాథరెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రథం బజారులో 'స్వచ్ఛోత్సవం'

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపట్ల రథంబజారులో స్వచ్ఛోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో పరిసరాలు పరిశుభ్రం చేశారు. బేతనీకాలని, రైలుపేట, ఉప్పరపాలెం, వివేకానందకాలనీ, దేవునిమాన్యం, దగ్గుమల్లివారిపాలెం ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతహీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సిబ్బంది

డోర్‌టూ డోర్ సర్వే నిర్వహించాలి

పట్టణంలో డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి ఆస్తి పన్నులోకి రానటువంటి భవనాల కొలతలను, ఉపయోగించే విధానాలను పరిశీలించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. పట్టణంలో 10బృందాలు గురువారం నుంచి వార్డుల వారిగా సర్వే నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్, ఇన్‌స్పెక్టర్ షేక్.ఇమామ్, శివరామకృష్ణ, సచివాలయాల పరిపాలన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్త్ నారీ - సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారులు ఎస్.చంద్రిక, షేక్.సుహానాబేగంల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జీఎస్‌పాలెం సచివాలయం పరిధిలోని వైద్య ఆరోగ్యకేంద్రం నందు రోగులకు పలు వైద్య సేవలను నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు కె.నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ యు.నరసింహారావు, వైద్యసిబ్బంది, సచివాలయ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డివి లలితకుమారి అన్నారు. బుధవారం వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అందిస్తున్న 14 ఆరోగ్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మాతృత్వ సంరక్షణ సేవలు, కుటుంబ సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, శిశు సంరక్షణ, చెవి, ముక్కు, కంటి సేవలను అందిస్తున్నట్లు వైద్యులు అబ్రహం లింకన్, పవన్‌చైతన్యలు వివరించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, సర్పంచ్ రవికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● అమృతలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వస్థనారీ సశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని సర్పంచ్ దేవరకొండ రాము తెలిపారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నుందు బుధవారం స్వస్థనారీ సశక్తి పరివార్ అభయాన్‌ను వైద్యాధికారి వెంకటలక్ష్మీ ప్రారంభించారు. మహిళలు అందరూ వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యవంతంగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం పలు వైద్య పథకాలను అమలు చేస్తుందని వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. బుధవారం కర్లపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్‌లో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా ప్రాథమిక, సామాజిక ఆరోగ్య, ఏరియా ఆసుపత్రి, ఉపకేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపీపీ యారం వనజ, గ్రామసర్పంచ్ నక్కా లలితకుమారి, సూపరింటెండెంట్ రజని పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల వినియోగంపై రైతులకు మండల వ్యవసాయాధికారి బ్రహ్మరెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిధిలోని ఓలేరు, గొరికపూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోందిలో భాగంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ వారి సౌజన్యంతో వరి పంటలో రసాయన ఎరువుల వాడకంపై ఏవో పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయిలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యావారధి అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో వక్తృత్వంలో టీఎంరావు పాఠశాల పదో తరగతి విద్యార్థిని కెవి ప్రణీతసాయి ప్రథమ స్థానం, డి.యామినిలత ద్వితీయ స్థానం, సూరేపల్లి విపి అండ్ జీఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని వై.మౌనిక తృతీయ స్థానం సాధించింది. వ్యాసరచనలో టీఎంరావు పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షేక్ యాసినా ప్రథమ స్థానం, సూరేపల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని సీహెచ్ స్వరూప ద్వితీయ స్థానం, టీఎంరావు పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఎం.అక్షయ తృతీయ స్థానం సాధించారు. విజేతలను ఎంఈవో ఎం.దేవరాజు తదితరులు అభినందించారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనం

● టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య

వేమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా భవిష్యత్తులో బహుళ ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు, కుచ్చెళ్లపాడు పంచాయతీ ప్రెసిడెంట్ గాజుల వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామ పంచాయతీ వద్ద కార్యదర్శి సాధిక్ అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు విష్ణుమొలకల అంజనేయులు, ఎస్సీ సెల్ టీడీపీ నాయకులు రాజు, కొల్లి వెంకటేశ్వరరావు, తాడికొండ కోటేశ్వరరావు, జనసేన నాయకులు వెలివెల ధర్మేంద్ర, గాజుల తిరుమలరావు, సాంఘిక కార్యకర్త రామపవన్, వీఆర్వో శివకుమార్, డీలర్ తాడికొండ నాగమణి పాల్గొన్నారు.

● రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం రాజవోలు గ్రామంలో బుధవారం స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు ముఖ్యఅతిధిగా పాల్గొని రైస్ కార్డులను వినియోగదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమిపార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెం షాపు నెంబరు 21లో స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం ఇంటింటికి వెళ్లి గ్రామసర్పంచ్ పీతా శ్రీనివాసరావు, నీటి సంఘ నాయకుడు దొప్పలపూడి రాజశేఖర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాయుడు, మహిళా కానిస్టేబుల్ ఉమారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ధాత్రి, డీలర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు అన్నివిధాలా ఉపయోగపడతాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరంలోని రేషన్ దుకాణాల్లో మండలంలోని సుమారు 5 వేల స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం శివప్రసాద్, స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రేషన్ పంపిణీలో ఎటువంటి జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విచారపు వీరయ్య, మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, లుక్కా గుడారంకయ్య, డీలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ప్రారంభం

వేమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు బుధవారం మండలంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి పర్యవేక్షణలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించి గర్భిణులకు సీమంతాలు జరిపారు. అమృతవాణి మాట్లాడుతూ, తల్లిపాలపై అవగాహన కల్పించే విధంగా సూచనలు చేశారు. అక్టోబరు 16 వరకు మాసోత్సవాల నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో స్వాతి, ఏఎన్‌ఎం సునీత, సుధ, అంగన్‌వాడీలు ధనమణి, సరోజిని, రాజ్యలక్ష్మి, రాజకుమారి, మాధవి, రెబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా రాఘవేంద్ర బాధ్యతలు


రాఘవేంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ ఏఈగా బి.రాఘవేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈగా పని చేస్తున్న శాంతకుమారి బాపట్లకు బదిలీ కావడంతో ఆ స్థానంలో నూతనంగా రాఘవేంద్రను నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఏఈకి రేపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామసుధాకర్, ఏఈ ఎం.కోటేశ్వరరావు, లైన్‌మెన్లు శ్రీనివాసరావు, శంకర్, హరికృష్ణ, లక్ష్మయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చేనేత సహకార సంఘాల బకాయిలను వెంటనే చెల్లించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని చేనేత కార్మిక సంఘ సహాయ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం భట్టిప్రోలు ఏఐటీయుసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేనేత కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త అధ్యయన యాత్ర గురువారం బాపట్ల జిల్లాకు వస్తుందన్నారు. వివిధ పథకాల రూపంలో చెల్లించాల్సిన రూ.127.87 కోట్ల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. సంఘ సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, వీరమోహనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెట్లు నరికేస్తున్నారు.. సంరక్షణ మరిచారు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటండి.. చెట్లు పెంచండి, పర్యావరణ సమతుల్యతను కాపాడండి అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే నాయకులు, అధికారులు సంరక్షణ విషయంలో మాత్రం పూర్తిగా విఫలమౌతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డులో జీడిమామిడి పరిశోధనా కేంద్రం, విస్తరణశిక్షణా కేంద్రం సరిహద్దులో ఎప్పటి నుంచో చెట్లు ఉన్నాయి. పరిశోధన కేంద్రంవైపు, ప్రహరీ వైపు రోడ్డుకు ఇరువైపుల విస్తరించియున్న ఈచెట్లు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. వారం రోజులు క్రితం ఉన్నపాటున చెట్లను నరికేసి కొన్నిటిని పీకి పక్కన పడేశారు. రోజులు గడుస్తున్న వాటిని అలాగే ఉంచారు. చివరకు బుధవారం చెట్లను ముక్కలుగా కోసి ట్రాక్టర్‌లో తరలించారు. పర్యావరణహితులు దీనిని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయమై జీడిమామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావును వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయని అధికారులు తొలిగించారని చెప్పుకొచ్చారు.



బాపట్ల జీడిమామిడి పరిశోధన కేంద్రం భవనం పక్కనే నరికేసిన చెట్లు, ట్రాక్టర్‌లో తరలిస్తున్న చిత్రం


లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

వైద్యం కోసం.. ముఖ్యమంత్రి సాయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● 40మందికి రూ.32.53 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన వైద్యం అందుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో బుధవారం చికిత్స పొందుతున్న 40మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.32,53,838 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి నేటి వరకు అనేకమంది వైద్యానికి లక్షలాది రూపాయల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కర్లపాలెం మండలానికి చెందిన 28మందికి, పిట్టలవానిపాలెం మండలానికి చెందిన 10మందికి, బాపట్లకు చెందిన ఇద్దరికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాతాలీలా వరప్రసాదరావు, పిట్టలవానిపాలెం టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు

బాపట్ల ఏరియా వైద్యశాలలో బుధవారం స్వస్థనారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యరంగంలో క్యాన్సర్ వ్యాధికి అనేకమందులు వచ్చాయని మహిళలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలో మెడికల్ కాలేజి ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పేద ప్రజలు వైద్యం చేయించుకోలేని వారికి మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా నిలుస్తున్నారని, వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేయించి ఆర్థిక భరోసాను కల్పించామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 17 మందికి వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ 17 మంది పేద ప్రజలకు సీఎం సహాయనిధి కింద రూ.8,44,185 మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు పంతాని మురళీధరరావు, తొట్టెంపూడి సుభాష్, గుర్రం మురహరిరావు, అనగాని శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

● వైద్య ఆరోగ్య శాఖ సదస్సులలో వైద్యులు


పెరవలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

వేమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని వైద్యశాఖ అధికారులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి వేమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ జరీనా పర్వీన్, డాక్టర్ సౌమ్యల అధ్యక్షతన స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా ర్యాలీలు నిర్వహించి అనంతరం వైద్యులు మాట్లాడుతూ, ప్రధాని మోదీ జన్మదినం రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ చేసుకుని ప్రత్యేక చికిత్సలు అందించడంతో పాటు స్థానికంగా నిర్వహించే శస్త్ర చికిత్సలను చేయడంతో పాటు మేజర్ శస్త్ర చికిత్సల కోసం తెనాలి, గుంటూరు జిల్లా ఆసుపత్రులకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. అక్టోబరు 2వ తేదీ వరకు ప్రతిరోజు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 24వ తేదీ వేమూరులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రులకు సంబంధించిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్తినారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరంలో 96 మందికి పరీక్షలు

కొల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్వస్తినారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరంలో 96 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కొల్లూరు బాలురోన్నత పాఠశాలలో బుధవారం ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్‌లు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత కృష్ణానది వరదల సమయంలో 16 గ్రామాల్లో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా విశేష సేవలు అందించిన ఆశాలకు మాజీ ఎంపీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వైద్య శిబిరానికి హాజరైన వారికి వైద్యులు పరీక్షించి రక్త నమూనాలు సేకరించారు. వైద్యురాలు కావ్య మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు కొల్లూరులో వివిధ ప్రాంతాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు, మహిళలు, పురుషులు ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిమాండ్ కంటే అదనంగా యూరియా

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో యూరియా అవసరం 24 వేల మెట్రిక్ టన్నులు కాగా తమ ప్రభుత్వం అంతకంటే అదనంగా మొత్తం 26 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎక్కువగా యూరియా అందించినా సమస్యలు ఎందుకు వచ్చాయని పరిశీలిస్తే వర్షాలు అధికంగా పడటం వలన యూరియా కొట్టుకుపోయి వినియోగం పెరిగిందన్నారు. దీనికి తోడు కొన్ని మాధ్యమాల్లో యూరియా కొరత అనే ప్రచారం వల్ల రైతాంగం కంగారుపడి అధిక కొనుగోళ్లు చేయడం కూడా ఒక కారణం అన్నారు. రాబోయే సంవత్సరం అయినా ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా మార్క్‌ఫెడ్ నుంచి అధికంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కౌలు రైతులు ఎక్కువగా ఉండటం వల్ల వారిలో ఎవరెవరు యూరియా తీసుకుంటున్నారు అనేది తెలియడం లేదు. ఓటీపీ మెకానిజం ద్వారా ఒరిజినల్ కౌలుదారులకు యూరియా అందేలా చర్యలు తీసుకోబోతున్నామన్నారు. ఇప్పటివరకు 13 వేల మట్టి నమూనాలు పరీక్షించామని అధికారులు చెబుతున్నారు. అయితే చాలా చోట్ల సాయిల్ టెస్టులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. నూతన సాంకేతిక విధానం ద్వారా సాయిల్ టెస్టులు జరిగేలా చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా రైతులకు బీమా సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. 90 శాతం మంది రైతులు ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయలేకపోతున్నారు. దానికి గల కారణాలపై సమాచారం సేకరిస్తున్నామన్నారు.. త్వరలోనే పరిష్కార మార్గాలు కనుగొని తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత సమస్యలు, ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖలు రాసి పరిష్కార మార్గాలు చూపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఎల్‌డీఎం మహిపాల్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు రైతు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష నిర్వహిస్తోన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



విద్యార్థులతో కలిసి సందడి చేస్తున్న మంచు లక్ష్మీప్రసన్న



స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంచు లక్ష్మీప్రసన్న, చిత్రంలో ఎమ్మెల్యే ప్రవీణ్

మంచు లక్ష్మీప్రసన్న సేవలు ఆదర్శనీయం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) టీచ్ ఫర్ చేంజ్ పేరుతో సంస్థను స్థాపించి పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటుచేస్తూ స్పోకెన్ ఇంగ్లీష్, సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేస్తున్న మంచు లక్ష్మీ ప్రసన్న అందిస్తున్న సేవలు ఆదర్శనీయం అని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. టీచ్ ఫర్ చేంజ్ సహకారంతో మండల పరిధిలోని ధరణికోటలోని ట్రులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఈవో-2 శివబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజక వర్గంలోని అమరావతి మండ లంలో పది పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మూడు రాష్ట్రాలలో టీచ్ ఫర్ చేంజ్ ద్వారా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. తాము మూడు సంవత్సరాలు పర్యవేక్షణచేసి స్థానిక ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారికి వదలివేయడం జరుగుతుందన్నారు. తాను నిర్మించిన దక్ష చిత్రం రెండు రోజులలో విడుదల కానున్నా ఇక్కడకు రావడం పిల్లలపై ఉన్న అభిమానమే కారణమన్నారు. పిల్లలతో కలసి సరదాగా నృత్యంచేసి వారితో పాటు, తల్లిదండ్రులు, బోధన సిబ్బందితో ఫొటోలు దిగారు. లక్ష్మీ ప్రసన్నను ఎమ్మెల్యే ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెగా సిస్టమ్ ఇండియా లీగల్ కౌన్సిల్ సుయోధన్, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో కేఎస్ఎన్ ప్రసాద్, శివబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, బోధనా సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసియా దేశాల్లో పిన్న వయస్కులకే పక్షవాతం

పురుషుల కంటే స్త్రీలకే ఎక్కువ ప్రాణహాని

రొమ్ము క్యాన్సర్ కన్నా స్ట్రోక్ మరణాలే అధికం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): 'అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే ఆసియా దేశాల్లోనే పక్షవాతం త్వరగా దాడి చేస్తోంది. అమెరికాలో 60, 70 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో పక్షవాతం కనిపిస్తుంటే... భారత్ వంటి ఆసియా దేశాల్లో 40వ పడిలోనే పక్షవాతం బారిన పడుతున్నారు' అని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. జపాన్‌లోని హ్యూగో యూనివర్శిటీలో సెప్టెంబరు 13 నుంచి 15 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ (ఏపీ ఎస్‌సీ) 2025లో భారతదేశం నుంచి ఆహ్వానిత స్పీకర్‌గా ఆమె ప్రాతినిధ్యం వహించారు. బుధవారం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ విజయ ఈ సదస్సు విశేషాలను తెలిపారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు హోదాలో హాజరైన తాను... సదస్సులో సభ్య దేశాలతో సహకార రౌండ్ టేబుల్ ప్లాట్‌ఫాంకు నాయకత్వం వహించినట్లు తెలిపారు.

పురుషుల కంటే స్త్రీలకే...

'పురుషులతో పోలిస్తే మహిళల్లో పక్షవాతం తీవ్రంగా దాడి చేస్తుంది. వీరిలో ప్రాణ హాని కూడా ఎక్కువగానే ఉంటుంది' అని డాక్టర్ విజయ తెలిపారు. ముందస్తు రుతు చక్రం, హార్మోన్ మందుల వాడకం, గర్భం ధరించడం, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీవోడీ), సెరిబ్రల్ వీనస్ త్రాంబోసిస్ (సీవీడీ), అధిక రక్తపోటు, ఎండోమెట్రి యాసిస్, మెనోపాజ్ వంటివి ఇందుకు దోహదపడుతున్నట్లు ఆమె వివరించారు. మహిళల్లో పక్షవాతం వల్ల మరణాలు రొమ్ము కేన్సర్ కంటే రెండింతలు అధికంగా ఉం టున్నాయి. ఇటీవల పిల్లలు, ఇరవై ఏళ్లలోపు యువతలో కూడా పక్షవాత మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తున్నాయి' అని డాక్టర్ విజయ వెల్లడించారు. దీనిపై తాము పరిశోధనలు జరుపుతున్నట్లు ప్రకటించారు.




జపాన్‌లో సదస్సు ప్రాంగణంలో ఐఎస్‌ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

16 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 16 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 8,454, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967, 16 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,26,240 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,79,861 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,38,805 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పెరుగుతున్న వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,12,284 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,98,825 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 7,932, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ఉన్న నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.95 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,27,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 94,448 క్యూసెక్కులు, మొత్తం 1,11,448 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

అంధురాలిపై..రాబంధువుల కుట్ర!

తల్లిదండ్రుల మరణంతో రూ.40 కోట్ల ఆస్తికి ఎసరు

తప్పుడు పత్రాలతో ఆస్తుల రిజిస్ట్రేషన్

సోదరుడి ఫిర్యాదుతో ఆరుగురి అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మరణంతో ఒంటరైన కుమార్తె రూ.కోట్ల ఆస్తులపై బంధువుల కళ్లు పడ్డాయి. అంధురాలు, అందులోనూ మానసిక దివ్యాంగురాలనే కనికరం చూపకుండా.. తప్పుడు పత్రాలతో స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిందంటూ ఆస్తులను విక్రయించారు. బాధితురాలికి వరుసకు సోదరుడయ్యే వ్యక్తి ఫిర్యాదుతో అసలు గుట్టు బయటపడింది. ఇందుకు కారణమైన నిందితులు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, ఫిర్యాది వివరాల మేరకు...అరండల్‌పేటకు చెందిన గుంటూరు విశ్రాంత సర్వేయర్ బొల్లేపల్లి వెంకట కోటయ్య, శారద దంపతులకు ఒకే ఒక్క కూతురు ఇందిర. పుట్టుకతోనే ఆమె మానసిక దివ్యాంగురాలు, పూర్తి గా అంధురాలు. కోటయ్య 2013లో మృతి చెందారు. ఆయన భార్య శారదకు గుంటూరు నగరం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సుమారు రూ.40 కోట్ల ఆస్తులున్నాయి. ఆమెకు చెల్లెలు రాణి, తమ్ముడు మాధవరావు ఉన్నారు. శారద వృద్ధాప్యంతో అస్వస్థతకు లోనైన సమయంలో కృష్ణాజిల్లా నందిగామ మండలం కమ్మవారిపాలేనికి చెందిన తమ్ముడు చాపలమడుగు మాధవరావు, కుమారుడు ఉమాశంకర్, కోడలు దుర్గ భవాని రంగంలోకి దిగారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న శారదను నిర్బంధించి ఇంటిలో ఉన్న ఆస్తుల దస్తావేజులను, రెండు కిలోల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి వస్తువులతో పాటు సుమారు రూ.70 లక్షల నగదును వారు బలవంతంగా తీసుకెళ్లారని శారద చెల్లెలు రాణి కుమారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు గత మే నెలలో కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో మాధవరావు, కుమారుడు ఉమాశంకర్‌తో పాటు.. పలువురు బంధువులు, ఇంటిలో పని పనివాళ్లు, స్నేహితుల పేరుతో ఇందిర నుంచి స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని దాని ద్వారా పెద్ద ఎత్తున ఆస్తులు విక్రయించినట్లు తేలింది. ఈ కేసులో మాధవరావు, కొడుకు ఉమాశంకర్, కోడలు దుర్గా భవాని, వియ్యంకురాలు పి.వెంకట్రావమ్మ, మాధవరావు ఇంటిలో పనిమనిషి పి.శౌరి, నిమ్మగడ్డ గ్రామానికి చెందిన కొర్రపాటి నారాయణ, గౌరవరం గ్రామానికి చెందిన పరిమి సుబ్బారావు, కమ్మవారిపాలేనికి చెందిన కొర్రపాటిరాణి, నగరంలోని హిమనినగర్‌కు చెందిన ఉమాశంకర్ డ్రైవర్ బొప్పూడి నాగరాజును నిందితులుగా చేర్చారు. ఇంతకు ముందే వెంకట్రావమ్మ, శౌరి, కొర్రపాటి నారాయణ, పరిమి సుబ్బారావు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం ఉమాశంకర్, భార్య దుర్గ భవానీని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాధవరావు, కొర్రపాటి రాణి, బొప్పూడి నాగరాజు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

దస్తావేజులను రద్దు చేయాలి

నకిలీ దస్తావేజులు సృష్టించి అక్రమంగా విక్రయాలు జరపడానికి కారణమైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు కోరారు. దస్తావేజులను సీజ్ చేసి, చట్ట ప్రకారం వాటిని రద్దు చేయించాల న్నారు. నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే గుంటూరులోని ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. కృష్ణాజిల్లాలోని వత్సవాయి తహసీల్దారుకు తాను నోటీసు ఇచ్చినప్పటికీ ఇందిర పేరుతో పాసు పుస్తకాలు ఇచ్చారని, ఆమె దరఖాస్తు చేయలేదని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని చెప్పారు. వాటిని ఉమాశంకర్ వేరే వారికి విక్రయించాడన్నారు. ఇందిర ఉమాశంకర్ కూతుర్ని దత్తత తీసుకున్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తులు కొట్టేసారని విమర్శించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆమె స్పెషల్ పవర్ ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి ఆస్తులను కొట్టేశారన్నారు. ఇందిర గార్డియన్ వ్యవహారంపై కూడా చర్యలు చేపట్టాలని, నిర్బంధంలో ఉన్న ఇందిరను విడిపించాలని కోరారు.

రైల్వేలో విస్తృతంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ - 2025లో భాగంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు డీఆర్ఎం సుదేష్ణ సేన్ తెలిపారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో 15 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను వెల్లడించారు. తొలుత రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో జరిగిన శ్రమదానంలో పాల్గొని చెత్త, చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిత్యం జరుగుతాయన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, టాయిలెట్స్‌ని శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య శిబిరాలు, మారథాన్/వాకథాన్, మొక్కలు నాటే కార్యక్రమాలు వంటివి పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎంలు కమలాకర్‌బాబు, డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

సమర్థంగా సేవలు అందించండి

ఎస్పీకి స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచన

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన, సమర్థంగా సేవలు అందించడం ద్వారా పోలీస్ ప్రతిష్ట పెంచాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. బుధవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో అయ్యన్నపాత్రుడిని ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందిం చారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జిందాల్‌కు పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని ఆయన సూచించారు.

బందోబస్తుపై సమీక్ష..

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతో సమన్వంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం ఆయన తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హాజరయ్యే ప్రముఖులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ విధి నిర్వహణలో దృఢంగా వ్యవహరించాలన్నారు. సచివాలయానికి వీవీఐపీ, వీఐపీలు వచ్చే మార్గాలను ముందుగానే క్లియర్ చేసి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అసెంబ్లీ సమావేశ మందిరానికి వీవీఐపీ, వీఐపీలు, మీడియా వారు, సందర్శకులు వెళ్లేందుకు ఉన్న అన్ని గేట్లలో డీఎస్పీస్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియ మించడం జరిగిందన్నారు. బాడీ ఓర్ కెమెరాలు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణ మూర్తి, రవికుమార్, హనుమంతు,డీఎస్పీలు,సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.



అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ఆర్యవైశ్య సంఘ భవనం అక్రమ రిజిస్ట్రేషన్

● బ్యాంకు రుణానికి వెళ్లడంతో వెలుగు చూసిన వైనం

యడ్లపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు ఆర్యవైశ్య సంఘం భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘం ఉపకోశాధికారిగా వ్యవహరించిన వ్యక్తే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సంఘ సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. సంఘ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. "1925లో గ్రామానికి చెందిన ధూమాళరావు బుచ్చన్న పంతులు, హనుమాయమ్మ లైబ్రరీ సెంటర్‌లోని 4 సెంట్ల విస్తీర్ణంలోని భవనాన్ని ఆర్యవైశ్య సంఘానికి దానంగా ఇచ్చారు. దానికి అనుబంధంగా ప్రపత్తి ఆంజనేయస్వామి దేవాలయం కూడా ఉంది. ఆ భవనాన్ని అద్దెకు ఇస్తూ దానిపై వచ్చే అద్దెలతో ఆలయ నిర్వహణ చేసేవారు. శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని, భవనాన్ని 2011లో కూల్చి వేశారు. నూతన భవనాన్ని నిర్మించే సమయంలో గ్రామంలోని ఆర్యవైశ్యులంతా కలసి పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన బాలనాగు సత్యన్నారాయణ అధ్యక్షుడిగా మరో ఆరుగురు సభ్యులను కమిటీగా ఎన్నుకున్నారు. మద్దుల రమణారావు ఉప కోశాధికారిగా కమిటీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో.. అధ్యక్షుడితో సహా మిగిలిన వారంతా రమణారావుకే బాధ్యతలను అప్పగించారు. 2016లో ఆలయం, భవన నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీలో పన్ను నమోదు సమయంలో భవన యజమానిగా రమణారావు తన పేరును నమోదు చేయించుకున్నాడు. తన పేరుతో చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 2024లో భార్య శిరీష పేరుతో సదరు భవనాన్ని గిఫ్టడీడ్ చేయించాడు. ఇటీవల ఆ భవనంపై రుణం తీసుకునేందుకు నరసరావుపేటలోని ఓ బ్యాంకులో దరఖాస్తు చేశారు. బ్యాంకు సిబ్బంది భవనం కొలతలు తీసుకునేందుకు మంగళవారం గ్రామానికి వచ్చారు. భవనం కొలతలు తీస్తుండగా స్థానిక ఆర్యవైశ్యులు వారిని ప్రశ్నించారు. రమణారావు రుణం కోసం తన భార్య పేరుతో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దీనితో ఆర్యవైశ్యులు, మిగిలిన కమిటీ సభ్యులు రమణారావును నిలదీయగా అది తనదేనని, మీ వద్ద ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే చూపించండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీనితో ఆర్యవైశ్య సంఘ సభ్యులంతా కలసి విచారించగా భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి శశికళకు వినతిపత్రం అందజేశారు. భవనానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఇస్తే రికార్డులు సరిచేయడంతోపాటు రిజిస్ట్రేషన్ రద్దుకు సబ్ రిజిస్ట్రారుకు సిఫార్సు చేస్తామని పంచాయతీ కార్యదర్శి వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం అధ్యక్షులు సత్యన్నారాయణ, జాయింట్ సెక్రటరి కోటేశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్యవైశ్యులు ఉన్నారు.



ఉప కోశాధికారి రమణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆర్యవైశ్య సంఘ భవనం

అవీ..ఇవీ..

పందిళ్లపల్లి పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో శుక్ర, శనివారాల్లో చీరాల డివిజనల్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు కో- ఆర్డినేటర్ కర్ల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు అండర్ -14, అండర్-17 విభాగాల్లో యోగా, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు బ్యాడ్మింటన్, కబడ్డీ అన్ని విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండలస్థాయి పోటీల్లో విద్యార్థుల ఘనత

వేటపాలెం(చీరాల) : మండలస్థాయి పోటీల్లో పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అయితే పోటీల్లో పందిళ్లపల్లి విద్యార్థులు ప్రతిభతో మెరిశారు. విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు సరోజని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, పద్మ పెండెం, పోతురాజు, సోమశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సెయింట్ ఆన్స్‌లో చిప్ డిజైనింగ్ వర్క్‌షాపు


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జగదీష్‌బాబు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం చిప్ డిజైనింగ్‌పై వర్క్‌షాపు ప్రారంభించినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ప్రారంభించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిని తయారు చేయించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్రతినిధి ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ జగదీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో చర్యలు వేగవంతం


అర్జీదారులను విచారిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు చర్యలు వేగవంతం చేశారు. గత సోమవారం చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాలకు చెందిన 54 అర్జీలను అధికారులతో కలిసి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు బుధవారం పరిశీలించారు. అలాగే అర్జీదారులతో నేరుగా మాట్లాడి 51 అర్జీలకు పరిష్కారం చూపారు. అయితే మిగిలిన మూడు అర్జీలను సుదీర్ఘంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్‌లు ప్రభాకరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రతికుటుంబానికి స్మార్టు రేషన్ కార్డులు: తహసీల్దార్

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీలక్ష్మీ అధ్యక్షతన బుధవారం సాదాసీదాగా ముగిసింది. మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను ఎంపీపీతో పాటు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరుకాకపోవడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభించారు. సమావేశానికి వచ్చిన సభ్యులు కూడా ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తలేదు. దీంతో అధికారులే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రోడ్ల వెంబడి ఎక్కడ చెత్త అనేది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్వమిత్వ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ కుల ధ్రువీకరణపత్రాలు అందించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలానే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం స్మార్టు రేషన్ కార్డు అందిస్తుందన్నారు. భూసర్వే జరిగిన గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తామన్నారు. రెవెన్యూ సమస్యలపై గ్రామాలలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతు మోడల్ పాఠశాలల ఏర్పాటు వలన విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. మల్యాపాలెం పాఠశాల ఎదుట గ్రానైట్ వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వేగనియంత్రణలు ఏర్పాటు చేయించాలన్నా రు. వ్యవసాయశాఖ ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతు రైతులకు అవసరమైన ఎరు వులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉద్యా నవనశాఖ అధికారి హన్మంత్‌నాయక్ మాట్లా డుతూ వ్యవసాయ మోటార్ల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. అలానే వెదురు బొంగు సాగు చేసే రైతుకు హెక్టారు కు రూ.60 వేల సబ్సిడిని అందిస్తున్నామ న్నారు. వెలుగు ఏపీఎం రాజారావు మాట్లా డుతూ పొదుపు సంఘాలలో ఉన్న ప్రతి మహిళను లక్షాధికారిని చేసేందుకు పెద్దఎత్తున రుణాలను అందజేస్తున్నామ న్నారు. అర్‌అడబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ మాట్లాడుతు జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో తాగు నీటిసమస్యలు లేకుండా ఇంటింటికి కొళాయి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి, సీడీపీవో సుధా, డిప్యూటీ ఎంపీడీవో సుమతి, ఏపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, ఎస్ఎస్‌పీ, మార్కెటింగ్, అర్‌అండ్‌బీ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

నిషేధిత బర్లీ పొగాకు సాగు చేపట్టవద్దు

పంగులూరు, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రైతులెవరూ బర్లీ పొగాకు సాగు చేపట్టవద్దని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం బర్లీ పొగాకుసాగుపై నిషేధం విధించిందన్నారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బర్లీపొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న సాగుచేపట్టాలని కోరారు. పంటసాగు వివ రాలను ప్రతిరైతు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు అంజిరెడ్డి, టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయకులు వినయ్‌కుమార్, పవిత్ర, పలువురు రైతలు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

అందుబాటులో యూరియా

బల్లికురవ : ప్రభుత్వం అన్ని రైతుసేవా కేంద్రాలలో యూరియాను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతోందని, రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియా బస్తాలను గుంటుపల్లి, అంబడిపూడి, బల్లికురవ గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో నిల్వ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు మండలానికి 200 టన్నుల యూరియా వస్తోందని అవసరమైన రైతులు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఎవరైన అవసరం లేకుండా బ్లాక్ చేసి నిల్వలు పెడితే చర్యలు తప్పవన్నారు. ఎంఆర్‌పీ ధరకు బస్తా రూ.266.50కు అమ్మకాలు చేపడతామన్నారు. ఈ పరిశీలనలో ఏఈవో మౌలాలి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపంట ఈ-పంట పరిధిలోకి రావాలి

అద్దంకిటౌన్ : రైతులు సాగు చేసిన ప్రతి పంట ఈ పంట నమోదు పరిధిలోకి రావాల ని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం అద్దంకి పట్టణం పరిధిలోని పొలాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ పంట నమోదు ప్రకియకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కంది పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు కోటేశ్వరరావు, రేణుక, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

నేడు గోవాడలో శాస్త్రవేతలతో కిసాన్ గోష్టి

మండలంలోని గోవాడ గ్రామంలో గురువారం రైతులతో కిసాన్ గోష్టి నిర్వహించనున్నట్లు ఏవో వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి పలువురు శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. మండలంలోని రైతులు అందరు పాల్గొన్నాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ఒకరికి తీవ్రం..., మరొకరికి స్వల్పంగా ప్రమాదం

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం ఓ మైదానంలో ఆటలాడారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ముందు ఒకరిని దించేందుకు గాయత్రి రెస్టారెంట్ వెనుక ఉన్న కొత్తపాలెం వెళ్లారు. అక్కడ ఒక మిత్రుడిని దించి మిగిలిన ఇద్దరు తిరిగి వస్తుండగా మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి వాహనం అదుపుతప్పి ఢీ కొట్టారు. ప్రమాదంలో ఒకరుతీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియెగంలో తేస్తాం

బల్లికురవ, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వెంటనే వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడతామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కొండాయపాలెం, అంబడిపూడి గ్రామాలలో ఎంపీడీవో పారిశుధ్య పనులను పరిశీలించారు. కొండాయపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న వ్యర్థాలను పరిశీలించారు. అంబడిపూడి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. గ్రామాలలో ఎక్కడ చెత్త లేకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు బాద్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి పాల్గొన్నారు.


చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

చీరాల్లో సినీ హీరో నిఖిల్ సందడి

- గజమాలతో స్వాగతం పలికిన అభిమానులు
- మూడు రోజుల షూటింగ్ నిమిత్తం చీరాలకు విచ్చేసిన సినీనటుడు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో సినీహీరో నిఖిల్ సందడి చేశారు. మూడు రోజుల షూటింగ్ నిమిత్తం బుధవారం రాత్రి చీరాలకు చేరుకున్నారు. నిఖిల్ సినీహీరో, స్థానిక శాసనసభ్యులు కొండయ్యకు బంధువు కావడంతో సినీ అభిమానులు, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున జాతీయ రహదారికి చేరుకొని గజమాలతో స్వాగతం పలికారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కొద్ది రోజులు నిఖిల్ చీరాల్లోనే ఉండి ప్రచారం నిర్వహించారు. తిరిగి రెండేళ్ల తరువాత చీరాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది.


నిఖిల్‌కు గజమాలతో స్వాగతం

రోడ్డుపై, తూము మధ్యలో గొయ్యి

- పొంచి ఉన్న ప్రమాదం

పంగులూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి తూర్పుతక్కెళ్ళపాడు వైపువెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన తూముకు గొయ్యి పడింది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వైపుగా జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇటువైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రధాన రహదారిపై నిత్యం ప్రయాణం సాగించే ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతిని గుర్తించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారి మధ్యలో ఉన్న గొయ్యి

హెచ్ఐవీ, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఐవీ, డ్రగ్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ మాట్లాడుతూ కలుషితమైన సూదులు, సిరంజిలు, పరీక్షించని, రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవీ సంభవించే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిర్మూలనకు అందరూ కృషిచేయాలన్నారు. గ్రామీణస్థాయి వరకు విస్తరిస్తున్న డ్రగ్స్, గంజాయిలాంటి మత్తుపదార్థాలతో ప్రమాదం పొంచి ఉందన్నారు. వాటివాడకంతో కలిగే దుష్పలితాలు జీవితాలను నాశనం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీ.వేణుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్ కాలువలకు చిల్లకంపతో చిక్కులు

- డ్రాపులకు అడ్డుపడుతున్న కంప
- మరమ్మత్తులు కోరుతున్నరైతులు


చిల్లకంపతో నిండిన పంగులూరు మైనర్

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగర్ పంగులూరు మైనర్ కాలువ చిల్లకంపతో నిండింది. కాలువ ఎగువ నుండి నీటిప్రవాహంలో వచ్చినా, కంప డ్రాపలువద్ద పేరుకుపోవడంతో కాలువనీరు డ్రాపులపై పొర్లిపారుతూ కిందకుసరిగా నీరుచేరని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. కోటపాడు మేజర్‌పరిధిలోని పంగులూరు మైనర్‌కు తగిన మరమ్మతులు తక్షణమే చేపట్టాలని, దిగువకు సాగునీరు సక్రమంగా చేరేలా చర్యలచేపట్టాలని సాగర్ అధికారులను ఈ ప్రాంతరైతులు కోరుతున్నారు.

విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి


కోలాటం శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజికహిత కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్నేహిత అనే 5 రోజుల కార్యక్రమంలో విద్యార్థినులకు పలు కార్యక్రమాలపై శిక్షణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మహిళ విదార్థినులకు కోలాటం శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకురాలు ఈ.మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల నుంచి కళాంకరణ, మెహందీ, కోలటం వంటి కార్యక్రమాలు నిర్వహించడం నిర్వహించారు. మరో రెండురోజుల పాటు ఆరోగ్యం -పరిశుభ్రత, వైద్య క్యాంప్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అధ్యాపకులు డాక్టర్ ఎస్. షర్మిలారాణి, డి. రాజశేఖర్‌లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు పోలీసులకు పట్టుబడ్డాయి. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్నులు చెల్లించకుంటే కేసులు

- బాపట్ల ఆర్‌టీవో ప్రసన్నకుమారి

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరిగే వాహనాలకు సకాలంలో పన్నులు చెల్లించకుంటే కేసులు నమోదు చేస్తామని బాపట్ల ఆర్‌టీవో ప్రసన్నకుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని మల్లాయపాలెం, వేమవరం గ్రామాల వద్ద టాక్స్ చెల్లించని ట్రాలీ లారీపై కేసు నమోదు చేసి పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. అనంతరం ఇటీవల సుబాబుల్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన గ్రానైట్ లారీని స్టేషన్ నుంచి విడుదల చేయించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

- పనులను ప్రారంభించిన సర్పంచ్ విజయబాబు

సంతమాగులూరు సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత మాగులూరు గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు కూటమి నాయకులతో కలిసి జలజీవన్ మిషన్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో కోటి రూపాయల పనుల ద్వారా ప్రతి ఇంటికి కుళాయి బిగించి ప్రతి ఇంటికి త్రాగునీరు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న 12 వందల కుటుంబాలకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈ నిధులతో నూతన పైపులైన్ల ఏర్పాటు, ఇతర మౌలిక వసతలు కల్పింస్తామన్నారు. కార్యక్రమంలో చల్లా బ్రహ్మ రావు, జనసేన పార్టీ నాయకులు చల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధానిమోదీ జన్మదినం

చినగంజాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలను చినగంజాంలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ మండల అధ్యక్షులు ఉలిచి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలోని వాల్మీకి సేవాసంఘంలోని వృద్ధులకు నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉలిచి ఏసుబాబు, రేపాక మంగతయారు, శిఖరం కోటయ్య, మెట్టు వెంకటసుబ్బారావు, మోటుమర్రి వెంకటేశ్వర్లు , కోలా సుబ్బారావు, నూనె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

సంతమాగులూరు: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారము స్థానిక ప్రాథమిక ఉన్నత ఆరోగ్య కేంద్రంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తేలపోలు రమేష్ ఆధ్వర్యంలో రోగులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు డాక్టర్ కిరణ్ కుమార్ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, గుద్దంటి భవానీ, వెంకటేష్, సాయిరాం, భరణి, కుమార్, అయ్యప్ప, రఘు, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.